క్లుప్తంగా

లహరి బస్సులు ప్రారంభం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్ఆర్టీసీ భద్రాచలం డిపో నుంచి గురువారం లహరి బస్ సర్వీసులను ప్రారంభించామని డిపో మేనేజర్ రామారావు గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. సీట్‌తో పాటే స్లీపర్ నాన్ ఏసీ వంటి అధునాతన హంగులతో ఈ బస్సులు ఉంటాయని, వీటిని ప్రతి రోజు ఉదయం 9 గంటలకు, రాత్రి 10 గంటలకు భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరుతాయని తెలిపారు. హైదరాబాదులోని బీహెచ్ఎల్ నుంచి ఉదయం 9 గంటలకు, అదే విధంగా రాత్రి 9 గంటలకు భద్రాచలం బయలుదేరుతాయని వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా భద్రాచలం డిపో మేనేజర్ ఆయన తెలిపారు.

ఆన్‌లైన్ సర్వేపై శిక్షణ

చండ్రుగొండ: అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ చేసే విధానంపై టీచర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లోని పోకలగూడెం సెక్టార్‌లోని దుబ్బతండా గ్రామంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ నిర్మలాజ్యోతి, సూపర్‌వైజర్ రాణి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

చండ్రుగొండ: స్థానిక తహసీల్దార్‌గా బి.సంధ్యరాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న జగదీశ్వర్ వరంగల్‌కు బదిలీ కాగా ములుగు జిల్లాలో పనిచేస్తున్న సంధ్యరాణి ఇక్కడకు వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఆర్ఐ అక్బర్, కార్యాలయ సిబ్బందికి నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

పనులకు శంకుస్థాపన

చండ్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామంలో తాగునీటి సరఫరా పైప్‌లైన్ విస్తరణ పనులకు గురువారం కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. రూ.4 లక్షల నిధులు మంజూరుకి ఎమ్మెల్యే జారే ఆదినారయణ హామీ ఇవ్వడంతో పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆ పార్టీ నాయకుడు బోగినబోయిన కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కుక్కల ముత్యాలరావు, ఈ సతీష్, ఇనుముల సైదులు, బాణోత్ కిషన్ పాల్గొన్నారు.

షెడ్డు తొలగింపు

చర్ల: మండల కేంద్రంలోని చర్లలో సర్వే నంబర్ 117 (ప్రభుత్వ భూమి)లో అక్రమంగా నిర్మించిన షెడ్డును గురువారం రెవెన్యూ అధికారులు తొలగించారు. చర్లకు చెందిన ఓ కాంట్రాక్టర్ ఆ ప్రాంతంలో ఓ ప్రభుత్వ భవనాన్ని నిర్మాణం చేసిన సందర్భంలో సిమెంట్, ఐరన్ తదితర నిర్మాణ సామగ్రిని నిల్వ చేసుకునేందుకు ఈ షెడ్డును ఏర్పాటు చేసి, నిర్మాణం పూర్తయినప్పటికీ తొలగించకపోవడంతో రెవెన్యూ అధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు జేసీబీ సాయంతో దానిని కూల్చివేశారు.

ముగిసిన టోర్నమెంట్

పినపాక: ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుండి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ గురువారం విజయవంతంగా ముగిసింది. టోర్నమెంట్‌లో తుది పోరులో బీటీపీఎస్ ఎంప్లాయిస్, వెటర్నరీ అగ్రికల్చర్ టీములు పోటీ పడగా వెటర్నరీ అగ్రికల్చర్ టీం విజేతగా నిలిచింది. విజేతలకు డీఎస్పీ రవీందర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సీఐ కరుణాకర్, ఎస్సై వెంకటప్పయ్య, ప్రెస్ క్లబ్ సభ్యులు బిల్లా నాగేందర్, సనప భరత్, దిలీప్, కోటి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

రేపటికి ముందడుగు

మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. మహిళ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, ఇతర వృత్తిదారులకు శాలువాలతో సన్మానాలు చేశారు. మెమెంటోలు అందజేసి సత్కరించారు. కేక్ కట్ చేసి మహిళలు తినిపించుకున్నారు. కొన్ని చోట్ల మహిళలకు ఆటల పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాలలో రాణించాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వాపురం: కేట్ కట్ చేస్తున్న ఎంపీపీ సుజాత, అధికారులు, ప్రజాప్రతినిధులు



భద్రాచలంఅర్బన్: కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి సూరిరెడ్డి



మణుగూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు



బూర్గంపాడు: కేక్ తినిపించుకుంటున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



మణుగూరురూరల్: ఉద్యోగిని సన్మానిస్తున్న ఏరియా జీఎం రామచందర్ దంపతులు



దమ్మపేట: అంకంపాలెం ఆశ్రమ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్



దుమ్ముగూడెం: మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయ బృందం



అశ్వారావుపేట: ప్రధానోపాధ్యాయురాలు హరితను సత్కరిస్తున్న విద్యార్థినులు

'మీ ఎమ్మెల్యే మీ ఇంటికి' శ్రీకారం

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ 'మీ ఎమ్మెల్యే మీ ఇంటికి' అను పేరుతో కార్యక్రమాలకు శ్రీకారం చూట్టారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందిన ఏ సాయమైనా రోజుల తరబడి ఆలస్యం చేయకుండా నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇవ్వడమే ఈ కార్యక్రమ లక్ష్యం. అందులో భాగంగా అశ్వారావుపేట మండలంలో పలు గ్రామాల్లోని 37 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల రూ.3,704,292 లక్షల విలువైన చెక్కులు రాగా.. గురువారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. మరోవైపు ఆయన సున్నంబట్టి గ్రామంలోని ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో ఆకస్మికంగా తనిఖీలు చేసి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, ఎస్సై శివరామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, మొగళ్లపు చెన్నకేశవరావు, జూపల్లి ప్రమోద్, జ్యేష్ఠ సత్యనారాయణ, కోలా లక్ష్మీనారాయణ, సీపీఐ నాయకులు ఎస్‌డీ సలీం, గన్నిన రామకృష్ణ పాల్గొన్నారు.

జేవీఆర్ ట్రస్ట్ రైతులకు వరం

వ్యవసాయ భూములకు సాగునీరు అందించేందుకు విశేష కృషి చేస్తున్న జలగం వెంగళరావు చారిటబుల్ ట్రస్ట్ (జేవీఆర్) పేద గిరిజన రైతాంగానికి వరమని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. గురువారం మండలంలోని నెమలిపేట గ్రామానికి చెందిన చెందిన 52 మంది గిరిజన రైతులకు రూ.33లక్షల విలువైన ఎలక్ట్రికల్ పంపు సెట్లు, స్టార్టర్లను జేవీఆర్ ట్రస్ట్ ద్వారా అందించారు. ఈ మోటర్లను



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పక్కన జలగం ప్రసాద్‌రావు

మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావుతో కలిసి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ట్రాన్స్‌కో ఏడీ బి.వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్లు చిన్నంశెట్టి సత్యనారాయణ, నిర్మల పుల్లారావు, కార్యదర్శి మహేశ్వరి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కళాశాల పోస్టర్లు ఆవిష్కరణ

నెమలిపేట గ్రామంలోని కార్యక్రమంలో పెదవాగు ప్రాజెక్టు గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ప్రచార పోస్టర్లను మాజీ మంత్రి జలగం ప్రసాద్‌రావు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 28వ తేదీన జరిగే ప్రవేశ పరీక్షను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల బి.రోజా, కళాశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో మహిళల ముందంజ

చర్లరూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ముఖ్యంగా వైద్య వృత్తిలో తమ హవా కొనసాగిస్తున్నారు. ప్రతి ఏటా మార్చి 8న నిర్వహించుకుంటున్న మహిళ దినోత్సవం సందర్భంగా చర్ల మండలంలో వైద్యవృత్తిలో రాణిస్తున్న మహిళను 'సాక్షి' మీముందు ఉంచుతోంది. మహిళల కష్టానికి, వారి హక్కులకు గుర్తుగా ఉన్న మహిళ దినోత్సవం నాడు వారి శ్రమను గుర్తించాల్సి ఉంది.



వాగు దాటుతున్న డాక్టర్ దివ్య నయన (ఫైల్)

వైద్య సేవలు అందించడం అదృష్టం



ఏజెన్సీలోని పేద ప్రజలకు వైద్య సేవలు అదృష్టంగా భావిస్తున్న. 2020లో యంబీబీయస్ పూర్తి చేసి తర్వాత ఏడాదికి పైగా చర్లలోని పూర్తి ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సేవలు అందించా. ప్రజలను నేరుగా కలుస్తూ.. వారికి వైద్యం అందించడం వృత్తి పరంగా ఎంతో తృప్తినిస్తోంది. వర్షాకాలం సమయంలో ఏజెన్సీలోని కొన్ని గ్రామాలకు వెళ్లాలంటే రవాణా సౌకర్యం కూడా లేని పరిస్థితి కూడా వస్తోంది.

– డాక్టర్ యం.దివ్య నయన, సత్యనారాయణపురం మెడికల్ ఆఫీసర్

అన్ని రంగాల్లో రాణించాలి..



నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి. 2022 చివరలో బీహెచ్ఎంయస్ పూర్తి చేసి చర్ల మండలంలో సుమారు ఎనిమిది నెలలుగా పని చేస్తున్నాను. ఏజెన్సీలోని ప్రజలకు హోమియోపతి వైద్యంపై క్యాంపులను నిర్వహిస్తూ ఇక్కడి ప్రజలకు వివరిస్తూ వస్తున్నాం. హోమియోపతి మందుల వల్ల అనేకమందికి జబ్బులు నయమవ్వడంతో ఇప్పుడు ప్రజల్లో నమ్మకం పెరిగి హోమియోపతి వైద్యం విస్తరిస్తోంది.

– డాక్టర్ పూజ, హోమియోపతి వైద్యురాలు, కొయ్యూరు

యుద్ధప్రతిపాదికన మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

కరకగూడెం: స్థానిక తహసీల్దార్ నాగప్రసాద్ పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు పనులు మొదలుపెట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్న తీరును గురువారం 'సాక్షి'లో 'పల్లె రోడ్లు పట్టవా' అను శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ మేరకు స్పందించిన అధికారులు పనులకు శ్రీకారం చుట్టారు. రఘునాథపాలెం గ్రామంలో గతేడాది భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రహదారి ప్రమాదకరంగా ఉండడంతో ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్, మట్టిని తోలి పెద్ద గుంతను పూడిపించారు. 2, 3 రోజుల్లో మండలంలో గుంతలు పడిన రహదారులను ఇదేవిధంగా పూడ్చి ప్రజల ఇబ్బందులు తొలగిస్తానని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు. నిధులు మంజూరైతే శాశ్వతంగా మరమ్మతులు చేస్తామని పంచాయతీ రాజ్ డీఈ సైదుల్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, రికార్డ్ అసిస్టెంట్ నరేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే లక్ష్యం

భద్రాచలంఅర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే కమ్యూనిస్టుల కర్తవ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. గురువారం పట్టణంలోని భద్రాచలం పట్టణ కార్యాలయంలో జరిగిన సీపీఎం పట్టణ స్థాయి జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం భద్రాచలం పట్టణ అభివృద్ధిపై అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు సమస్యలతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రౌండ్ టేబుల్ సమావేశంలో టీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరికల తిరుపతిరావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు అబ్బినేని శ్రీనివాస్, సీపీఐ పట్టణ నాయకులు మా రెడ్డి శివాజీ, సీపీఐ (ఎంఎల్) ప్రజాబంధ నాయకులు కొండా చరణ్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

అద్భుతం.. ఆ ఆలయాలు!



బూర్గంపాడు: గోదావరి మధ్యలోని మోతెగడ్డకు చేరుకుంటున్న భక్తులు



చండ్రుగొండ: కనకగిరి గుట్టలపై కోనేరు వద్ద శివుడి ప్రతిమ



మణుగూరుటౌన్: నీలకంఠేశ్వర ఆలయంలో ద్విలింగ దర్శనమిస్తున్న శివుడు

- మణుగూరు నీలకంఠేశ్వరాలయంలో దేశంలోనే రెండో ద్విలింగం
- గోదావరి పుష్కరాలతో ఖ్యాతికెక్కిన మోతెగడ్డ ఆలయం
- కనకగిరి గుట్టలపై వీరభద్రుడు

మణుగూరుటౌన్: మణుగూరు నీలకంఠేశ్వరాలయం కాకతీయుల కాలం నాటిదిగా ప్రసిద్ధి చెందింది. దేశంలోనే శివుడు ద్విలింగ దర్శనం ఇచ్చిన మొదటి ప్రాంతం ఉజ్జయిని మహంకాళి ఆలయం కాగా.. మణుగూరు ఆలయం రెండోది. ఇక్కడికి వచ్చే భక్తులకు పాతాల లింగేశ్వరుడు స్థూపాకారంలో, నీలకంఠేశ్వరుడు బాణాకారంలో దర్శనమిస్తాడు. మణుగూరులోని ప్రాచీన నీలకంఠేశ్వరాలయంలో శివుడు కాకతీయుల కాలంలో స్వయంభువుగా వెలిశాడని, శివరాత్రి ఉత్సవాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు వరంగల్, జనగాం నుంచి కూడా భక్తులు ఇక్కడికి వస్తుంటారని ఆలయ పూజారి పంచాప్నుల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.

బూర్గంపాడు: గోదావరి పుష్కరాలతో రాష్ట్రవ్యాప్తంగా ఖ్యాతికెక్కిన మోతెగడ్డలోని భద్రకాళి సమేత వీరభద్రుని కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పవిత్ర గోదావరి నది మధ్యలో 600 సంవత్సరాలకు పైగా కాకతీయులకాలం నాటి నుంచి ఈ ఆలయానికి విశిష్ట చరిత్ర ఉంది. శివరాత్రి నాడు జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ఇక్కడకు వస్తారు.

దమ్మపేట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శివాలయాలను సుందరంగా గురువారం తీర్చిదిద్దుతున్నారు. దమ్మపేట, వడ్లగూడెం, నాచారం గ్రామాల్లోని శివాలయాలనూ ముస్తాబు చేస్తున్నారు.

చండ్రుగొండ: శివరాత్రి పర్వదిన వేడుకలకు మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి గుట్టలపై ఉన్న వీరభద్రుడి ఆలయం ముస్తాబైంది. కాకతీయుల కట్టడాలున్న ఈ ప్రాంతంలో వీరభద్రుడు ఐదుదశాబ్దాల క్రితం వెలిశాడు. గుట్టల పైభాగంలో ఉన్న కోనేరులో నిత్యం నీటి నిల్వ ఉండటం విశేషం. అయితే శివరాత్రి పర్వదినం ముగిసిన తరువాత ఈ కోనేరులోని నీటిని రైతులు తీసుకువచ్చి తమ పంట చేలలో చల్లుకుంటారు. ఇక్కడి వీరభద్రుడి కల్యాణోత్సవానికి భక్తులు వేలాదిగా వస్తారు.

ములకలపల్లి: మండలకేంద్రంలోని ఉమా పృథ్వీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గభక్తులను స్వాగతిస్తూ స్థానిక తెలంగాణతల్లి సెంటర్ వద్ద విద్యుత్ లైట్లతో శివపార్వతుల చిత్రాలతోపాటు, స్వాగత ద్వారాలను ఏర్పాటు చేశారు.

అశ్వారావుపేటరూరల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలను ముస్తాబు చేశారు. మండలంలోని వినాయకపురం వద్దగల శివాలయం, పాత మామిళ్లవారిగూడెం గ్రామంలోని శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం, అశ్వారావుపేటలోని కొనేరు బజార్‌లోగల పురాతన శివాలయాలకు ప్రత్యేకంగా రంగులు వేసి సిద్ధం చేయగా, ఆలయాలకు విద్యుత్ దీపాలను అలంకరించారు.

కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ భద్రాద్రి కొత్తగూడెం కార్యాలయం

షార్ట్ టెండర్ నోటీస్

సంఖ్య : 667/లైబ్రరీ/SCA/2024 తేది : 07-03-2024

ఈ దిగువ సంతకందారుచే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం పట్టణంలోని కొత్త గ్రంథాలయమునకు అదనపు సౌకర్యాలు మరియు పుస్తకాలు సరఫరా పని కొరకు అర్హులైన టెండర్‌దారుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

దరావత్తు రూ॥ 50,000/- లు.

దరఖాస్తు తేది : 08-03-2024 ఉదయం గం॥ 10-30 ని॥ల నుండి తేది : 12-03-2024 మధ్యాహ్నం 2-00 గం॥ల వరకు కోరబడుచున్నవి.

దరఖాస్తు ధర : రూ॥ 5000/- లు.

దరఖాస్తులు జిల్లా పంచాయతీ రాజ్, కొత్తగూడెం కార్యాలయము (హెడ్ పోస్ట్ ఆఫీస్ దగ్గర, కొత్తగూడెం) వారి నుండి పొందవచ్చును.

టెండర్ సమర్పించుటకు చివరి తేది : 12-03-2024 మధ్యాహ్నం 2-00 గం॥లు. మరియు అదే రోజు సాయంత్రం 4-00 గం॥లకు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం వారి కార్యాలయములో తెరువబడును.

ఇతర వివరాలకు ఫోన్: 94418 38032, 96662 69199 నందు సంప్రదించగలరు

సం/-
కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్
భద్రాద్రి కొత్తగూడెం.

భద్రాద్రి కొత్తగూడెం
07-03-2024